క్లుప్తంగా

ఎంపీడీవోకు ఫిర్యాదు



బాల్కొండ: ఆలయ నిర్మాణ పనులను అడ్డుకుంటున్న బాల్కొండ జీపీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిమిషాంబ దేవీ ఆలయ కమిటీ సభ్యులు ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. ఆలయం వద్ద నిర్మిస్తున్న కల్యాణ మండప నిర్మాణ పనులను అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రుజువులతో కార్యాలయానికి వెళ్తే అందుబాటులో లేరని, ఫోన్‌లో సంప్రదిస్తే సరైన సమాధానం చెప్పకుండా ఫోన్ కట్ చేశారని ఎంపీడీవోకు పేర్కొన్నారు. సెలవులో లేకున్నా గైర్హాజరు కావడంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ముప్కాల్ అకాడమీ, స్థానిక చైతన్య క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–16, 20 బాలుర కబడ్డీ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. కార్యక్రమానికి స్థానిక వైద్యుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, కబడ్డీ అసోషియేషన్ రాష్ట్ర టెక్నికల్ బోర్డు చైర్మన్ చంద్రమోహన్‌గౌడ్ హాజరూ మాట్లాడారు. గ్రామాల్లో శిక్షణ శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్, పీడీ రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల నిర్వహణకు సహకరించాలి



బాల్కొండ: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహణకు వీడీసీ సభ్యులు సహకరించాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ స్వామి అన్నారు. మండల కేంద్రంలో వీడీసీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. కళాశాలలు తరలిపోకుండా ఉండాలంటే విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. అలాగే ఫర్నిచర్ అందించాలన్నారు. స్పందించిన సభ్యులు తమవంతు సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన గొల్లెం శివన్న తన ఫోన్‌ను ఇటీవల పోగుట్టుకున్నాడు. దీంతో స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను కనుగొని బాధితుడికి అందించినట్లు ఏఎస్సై శంకర్ శనివారం తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు



రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లిలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు చిటుకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి సంతోష్‌రెడ్డి శనివారం తెలిపారు. గ్రామంలోని 422 గొర్రెలకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. తొలకరి వర్షాలకు గొర్రెలు, మేకలు లేత పచ్చని గడ్డి తినడం వల్ల కడుపులోకి బ్యాక్టీరియా చేరి అనారోగ్యానికి గురవుతాయని అన్నారు. ఈ వ్యాధికి గురి కాకుండా ఉండేందుకు నివారణ టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాల మిత్ర, వెటర్నరి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: ప్రైవేట్ కాలేజీల్లో ఉచిత ప్రవేశం కోసం దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 7.0, ఆపై జీపీఏ వచ్చిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, 08462 –251690 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మరమ్మతులకు నోచుకోని రోడ్డు

- గుంతలమయంగా మారిన వెల్కటూర్ దారి
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో ఉన్న వంతెన



గుంతలమయంగా మారిన రోడ్డు

బాల్కొండ: ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని గాలికి వదిలేసింది. దీంతో గ్రామాల్లోని రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో గ్రామ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెండోరా మండలం వెల్కటూర్ నుంచి వెల్కటూర్ తండా వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. గ్రామం నుంచి తండా వరకు గతంలోనే బీటీ రోడ్డును నిర్మించారు. కానీ ఈ రోడ్డు ప్రస్తుతం గుంతల మయంగా మారింది. దీంతో గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు రూ. 1.6 కోట్ల నిధులను మరమ్మతుల కోసం మంజూరు చేసింది. పాలకులు సైతం పనులకు శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా సంబంధిత అధికారులకు స్పష్టత లేదు. దీంతో అధికారుల నిర్లక్ష్యంగా ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో మరింత ఇబ్బందులు తప్పవని తండా వాసులు ఆవేదన చెందుతున్నారు.

శిథిలావస్థలో వంతెన..

గ్రామం నుంచి తండాల వరకు ఉన్న రోడ్డు కాకతీయ కాలువను క్రాస్ చేసుకుంటు వెళ్తుంది. కాలువ నిర్మాణ కాలంలో కాలువపై వంతెన నిర్మించారు. ప్రస్తుతం ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. గ్రామం నుంచి తండాకు, తండా నుంచి గ్రామానికి అనేక మంది రాకా పోకలు సాగిస్తారు. గ్రామస్తుల పంట భూములు తండాల వైపే ఉండటంతో రద్దీ అధికంగానే ఉంటోంది. అంతే కాకుండా తండాల మీదు నుంచి పెద్ద వాగు రోడ్డును కలుపుతు తారు రోడ్డును నిర్మించారు. దీంతో ముప్కాల్ మండల కేంద్రంలో కూడ రద్దీ ఉంటోంది. కానీ శిథిలావస్థలో ఉన్న వంతెన గురించి అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో తండా వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టి, శిథిలావస్థకు చేరిన వంతెనను నూతనంగా నిర్మించాలని గ్రామస్తులు, తండావాసులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపడుతాం

వెల్కటూర్ నుంచి తండా వరకు ఉన్న రోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయి. ఉన్నతాధికారులకు వంతెన గురించి ప్రతిపాదనలు పంపుతాం. త్వరలోనే మరమ్మతులు చేపడుతాం.

– వినీత్, ఆర్అండ్‌బీ ఏఈఈ, బాల్కొండ

ఆగిన రహదారి విస్తరణ పనులు

- వరుస ఎన్నికలతో బ్రేక్
- వర్షాకాలం రావడంతో మరింత ఆలస్యం?
- పనులు పూర్తి చేయాలంటున్న వాహనదారులు



పచ్చలనడ్కుడ నుంచి వేల్పూర్ వెళ్లే రోడ్డుపై నిలిచిన విస్తరణ పనులు

వేల్పూర్: మండలంలోని పలు గ్రామాల రోడ్డు విస్తరణ పనులు వరుస ఎన్నికలు రావడంతో ఆగిపోయాయి. ఎన్నికలు పూర్తయ్యే సరికి వర్షాకాలం మొదలవుతుండడంతో పనులు మరింత ఆలస్యం కానున్నాయి. గత ప్రభుత్వంలో రహదారులు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పచ్చలనడ్కుడ నుంచి వేల్పూర్ వరకు రూ. 5.88 కోట్లు, అంక్సాపూర్ నుంచి వేల్పూర్ వరకు రూ. 8.10 కోట్లు, పచ్చలనడ్కుడ నుంచి కొత్తపల్లి(ఎస్) గ్రామం మీదుగా చింతలూరు వరకు రూ. 9 కోట్లు, పచ్చలనడ్కుడ నుంచి వాడి గ్రామం వరకు రూ.4.15 కోట్లతో నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరైన వెంటనే శంకుస్థాపన చేయగా, పచ్చలనడ్కుడ నుంచి వేల్పూర్ వైపు, వాడి, కొత్తపల్లి గ్రామాల వైపు పనులు మొదలయ్యాయి. వేల్పూర్ నుంచి అంక్సాపూర్ పనులు మొదలు కాలేదు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం, అంతకు ముందు వేల్పూర్ మండలంలో నిర్మించిన రహదారులకు పూర్తిస్థాయిలో బిల్లులు రాకపోవడంతో రహదారుల విస్తరణ పనులు ఆగిపోయినట్లు సమాచారం. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆర్అండ్‌బీ మంత్రిగా ఉండగా వేల్పూర్ నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు ఉన్న రోడ్లను డబుల్‌రోడ్లుగా మార్చేందుకు విడతల వారీగా నిధులు మంజూరు చేయించారు. జాతీయ రహదారి 44 నుంచి 63 నంబరు జాతీయ రహదారిని బ్రాహ్మణపల్లి, తొర్లికొండ, జాన్కంపేట్, సాహెబ్‌పేట్, వేల్పూర్, వెంకటాపూర్, కోమన్‌పల్లి, కుకునూర్ గ్రామాల మీదుగా ఉన్న రహదారిని సుమారు రూ.40 కోట్లతో డబుల్ రోడ్డుగా నిర్మింపజేశారు. దీంతో పాటు మోతె గ్రామం నుంచి అక్లూర్ మీదుగా బడాభీమ్‌గల్ క్రాస్‌రోడ్డు వరకు డబుల్ రోడ్డు పూర్తయింది. వీటితో పాటు కొత్త రోడ్లు సైతం డబుల్‌రోడ్లుగా మార్చే క్రమంలో నిధుల కొరత, ఎన్నికలు రావడం రహదారులకు ఆటంకంగా మారాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రైతులకు రసీదులు అందించాలి



మెండోరాలో దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి



నందిపేటలో..

బాల్కొండ/ నందిపేట్/ వేల్పూర్: విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు దుకాణదారులు తప్పనిసరిగా రసీదులు అందించాలని మెండోరా వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. మెండోరా మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. స్టాక్ వివరాలను బోర్డుపై నమోదు చేయాలన్నారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంట కోత వచ్చే వరకు రైతులు కొనుగోలు చేసిన తమ విత్తనాల రసీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈవోలు తదితరులు ఉన్నారు.

నందిపేట మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న భవాని తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదులు అందించాలన్నారు. రైతులు సైతం బిల్లులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేల్పూర్ మండలంలోని విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి నర్సయ్య శనివారం తనిఖీ చేశారు. రైతులు తప్పనిసరిగా తాము కొనుగోలు చేసిన విత్తనాల రసీదులను పొందాలని సూచించారు. దుకాణదారులు రైతులకు రసీదులు అందించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.



వేల్పూర్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారి

శానిటేషన్ పనుల పరిశీలన



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చేపడుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం పరిశీలించారు. సీడీఎంఏ ఆదేశాల మేరకు రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని 15 రోజుల పాటు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట శానిటేషన్ ఎస్సై మహేశ్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి తదితరులు ఉన్నారు.

రైతులు, సైనికులకు సన్మానం



బోధన్: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో 8 మంది రైతులు, సైనికులను కోటగిరి మండల కేంద్రానికి చెందిన టీఎంఆర్ (తాటి మణెమ్మ–రాములు) ఫౌండేషన్ వారు సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం సన్మానించారు. ఫౌండేషన్ చైర్మన్ తాటి వీరేశం, ఏఎస్సై కొత్త రవీందర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, సభ్యులు మురహరి, సాయిలు, దావులు, షికారి గంగాధర్, వేముల గంగారాం, ముత్తయ్య, ఉమానందన్, కిశోర్, షికారి శివ పాల్గొన్నారు.

పునాదులకే పరిమితం..



నిలిచిపోయిన జీపీ భవన నిర్మాణ పనులు

- రూ. 20 లక్షల అంచనాతో జీపీ భవన నిర్మాణం
- 9 నెలలు గడుస్తున్నా ముందుకు సాగని పనులు

కమ్మర్‌పల్లి: మండలంలోని నాగాపూర్‌లో జీపీ భవన నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. పనులు ప్రారంభించి 9 నెలలు గడుస్తున్నా బేస్‌మెంట్ పనుల వద్దే ఆగిపోయాయి. దీంతో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు ముందుకు సాగుతాయో లేదోనని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద నాగాపూర్ గ్రామానికి నూతన జీపీ భవనం మంజూరైంది. 2023 ఆగస్టు28న రూ. 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులకు నాటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఎమ్మెల్సీ కవితతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం పనులు ప్రారంభమై చురుగ్గా సాగాయి. పునాదులు తవ్వి చుట్టూ బేస్‌మెంట్ నిర్మించారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశాడు. ఎన్నికల కోడ్ ముగిసినా పనులు ప్రారంభం కాలేదు. మార్చి నెల నాటికి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెండు నెలల్లో పూర్తి చేయిస్తాం

గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు ఆగిపోయిన మాట వాస్తవమే. పనులను వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. రెండు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. శ్రీనివాస్, ఏఈ పీఆర్

రైతుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శోభన్

బోధన్: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ధరణి లోపాలను సవరించేందుకు జిల్లా స్థాయి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి భూసమస్యలు పరిష్కరించాలని, రెవెన్యూ రికార్డుల్లో కాలం ఏర్పాటు చేసి కౌలు రైతులు, వాస్తవ సాగుదారుల పేర్ల నమోదు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ. 2 లక్షల పంట రుణమాఫీ, వరి ధాన్యం క్వింటాలుకు రూ . 500బోనస్, రూ. 15 వేల పెట్టుబడి సాయం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్ అప్ప, పల్లపు వెంకటేశ్, ప్రతినిధులు భూమన్న, గంగామణి, నాగలక్ష్మి, లక్ష్మణ్, ముత్తన్న, సుశీల, సాయిలు, పద్మ ,మురళి, లక్ష్మి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో నెట్‌బాల్ టోర్నమెంట్



నవీపేట: మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్‌ను శనివారం నిర్వహించారు. టోర్నమెంట్‌లో బాలికలు, బాలుర విభాగంలో ఆరు జట్లు పోటీపడ్డాయి. బాలికల విభాగంలో సుద్దులంకు చెందిన శ్రీకర్స్ జట్టు విజేతగా నిలువగా నిజామాబాద్‌కు చెందిన వారియర్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. బాలుర విభాగంలో నిజామాబాద్‌కు చెందిన వారియర్స్ జట్టు విజేతగా నిలువగా.. తాడ్‌బిలోలికి చెందిన థండర్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. అనంతరం విజేత జట్లకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి నర్సయ్య, నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు రమేశ్, శ్రీనివాస్, గంగాధర్, పీఈటీలు రవి, శ్రీనివాస్, అబ్బయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బాల్కొండ: క్రీడల్లో గెలుపోటములు సహజమని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బాల్కొండ చాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న క్రీడా మైదాన పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల ప్రోత్సాహానికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అనంతరం గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యూనిస్, అన్వర్, కుందారుపు శ్రీనివాస్, రాజు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరైన సలహాలు ఇవ్వాలి



డిచ్‌పల్లి: శిక్షణలో నేర్చుకున్న అంశాలను చక్కగా అర్థం చేసుకుని పంటల సాగులో రైతులకు సరైన సలహాలు ఇవ్వాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) నిజామాబాద్ పథక సంచాలకులు (పీడీ) ఆర్ తిరుమల ప్రసాద్ సూచించారు. ఆత్మ ఆధ్వర్యంలో శనివారం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ రైతు వేదికలో డిప్లమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్ఐ) 2023–24 బ్యాచ్ –2 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ మాట్లాడుతూ.. ఈ కోర్సుతో డీలర్లకు వ్యవసాయంలో మెళకువలు, పంటల సాగులో నూతన పద్ధతులు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం శిక్షణ సంబంధిత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆత్మ అధికారులు, ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వెంట్రిలాక్విజం



నిజామాబాద్ అర్బన్: బాలభవన్‌లో వేసవి శిక్షణ తరగతులలో భాగంగా శనివారం జాదూ రంగనాథ్ వెంట్రిలాక్విజం ప్రదర్శన ఆకట్టుకుంది. ఆయన బొమ్మతో మాట్లాడించగా చిన్నారులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్ విఠల్ ప్రభాకర్, వెంకటలక్ష్మి, ఉమాబాల, పుష్పలత, అర్చన, శ్రీలత, గణేశ్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఫ్యూరియోసా (తెలుగు) - 12.25, రాజుయాదవ్(తెలుగు) - 3.40, 6.20, 9.00
స్క్రీన్-3 –	లవ్‌మీ (తెలుగు) - 11.50, ఫ్యూరియోసా (తెలుగు) - 02.45, 6.00, 9.15
స్క్రీన్-4 –	లవ్‌మీ (తెలుగు) - 1.30, 4.25, 7.20, 10.15

నిధుల లేమి.. నిర్వహణ భారం

- ఏడాదికి పైగా ఆగిపోయిన గ్రాంట్లు
- జీపీ ట్రాక్టర్ల ఈఎంఐ, సిబ్బంది జీతాలు చెల్లించలేని పరిస్థితి



సాహెబ్‌పేట్ గ్రామపంచాయతీ భవనం

వేల్పూర్: పంచాయతీల నిర్వహణ నిధుల లేమితో భారంగా మారుతోంది. ఏడాదిగా పైగా ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోవడంతో జీపీల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మేజర్ జీపీలకు ఉన్న రాబడితో ఎలాగోలా నెట్టుకొస్తున్నా, మైనర్ జీపీలకు అతికొద్దిగా వచ్చే ట్యాక్సులు సరిపోక కొట్టుమిట్టాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జీపీలకు ఇచ్చిన ట్రాక్టర్లకు ఈఎంఐలు కట్టలేక, వాటి నిర్వహణ ఖర్చు, రూ. వేల కరెంటు బిల్లులు, సిబ్బంది జీత భత్యాలకు డబ్బులు లేక కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. సర్పంచులు పదవిలో కొనసాగిన రోజుల్లో ప్రభుత్వం నుంచి నిధులు ఆలస్యమైతే, వారు చెల్లించి తర్వాత తీసుకునే వారు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో జీపీ కార్యదర్శుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది. వేల్పూర్ మండలంలో వేల్పూర్, మోతె, రామన్నపేట్, పచ్చలనడ్కుడ, అంక్సాపూర్, పడగల్ మేజర్ జీపీలుగా ఉండగా, లక్కోర, అమీనాపూర్, అక్లూర్, పోచంపల్లి, కుకునూర్, కోమన్‌పల్లి, వెంకటాపూర్, అక్లూర్, జాన్కంపేట్, వాడి, కొత్తపల్లిఎస్, సాహెబ్‌పేట్, హనుమాన్ నగర్ జీపీలు మైనర్ జీపీలుగా ఉన్నాయి. పల్లె ప్రగతి కార్యక్రమం కొనసాగుతున్న రోజుల్లో నిధులు వచ్చేవి. తర్వాత నిధుల విడుదల ఆగిపోయింది. వేల్పూర్ మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు ఒక్కో స్పెల్‌కు రూ. 80 లక్షల గ్రాంటు వచ్చేది. ఇలా ప్రతి రెండు నెలలకోసారి విడుదల అయ్యేది. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎస్ఎఫ్‌సీ నిధులను రెండేళ్లపాటు ప్రతినెల విడుదల చేసి, తర్వాత విడతల వారిగా చెల్లించినట్లు సమాచారం. సుమారు 14 నెలల నుంచి జీపీలకు నిధులు లేకపోవడంతో నిర్వహణ దినదిన గండంగా మారుతోంది. ఇకనైనా ప్రభుత్వం జీపీలకు నిధులు విడుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.